BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU

మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ 11-02-2025
WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు

సీఎం రేవంత్‌తో మంద కృష్ణ భేటీ

ఎస్సీ వర్గీకరణ, ఉప కులాల రిజర్వేషన్లపై కీలక చర్చ

మహా, హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డితో మంగళవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ భేటీ అయ్యారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలులో భాగంగా విద్య, ఉద్యోగాలలో 3 గ్రూపులుగా వర్గీకరణ, ఎస్సీ ఉప కులాల రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన నివేదికపై వారు కీలక చర్చించారు. ఈ సందర్భంగా నివేదికపై ఉన్న కొన్ని అభ్యంతరాలను సీఎం రేవంత్ రెడ్డికి మంద కృష్ణ వివరించారు. ఎస్సీ రిజర్వేషన్లకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సానుకూలంగా ఉన్నామని.. అయితే జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికలో ఉన్న లోపాల వల్ల మాదిగలు, మరికొన్ని ఉపకులాల హక్కులు, వాటా, అస్తిత్వం, భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని మంద కృష్ణ తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి ముందు పలు సూచనలు, ప్రతిపాదనలు పెట్టారు. వాటిపై ఈ భేటీలో చర్చలు కొనసాగాయి. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు కే.కేశవరావు, సీఎం సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ సహా పలు దళిత సంఘాల ప్రతినిధులు ఉన్నారు

ప్రతిపక్షాలవి అనవసర రాద్ధాంతమే

- రాజకీయాల్లో నైతిక విలువలు ముఖ్యం
- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మహా, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన సమగ్ర సర్వేపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని శాసన మండలి చైర్మన్ గుత్తా మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీపై తాను సీఎం రేవంత్ రెడ్డి కి లేఖ రాశానని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన , ఎగువన రెండు రకాలుగా రేషన్ కార్డులు జారీ చేయాలని సూచించానని పేర్కొన్నారు. అలా చేస్తే.. ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరుగుతుందని లేఖలో సీఎం రేవంత్ సమగ్రంగా వివరించినట్లుగా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ లో చేరడాన్ని ఎలా చూస్తారని ప్రశ్నించగా.. ఆయన సమాధానమిస్తూ.. ప్రస్తుతం ఆ అంశం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు పరిధిలో ఉందని అన్నారు. ఆ విషయంపై ఈ సందర్భంలో మాట్లాడటం కరెక్ట్ కాదని అన్నారు. ఒక్కసారి రాజకీయాల్లోకి వచ్చాక ఏ నాయకుడైనా నైతిక విలువలు పాటించాలని, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని కామెంట్ చేశారు. అదేవిధంగా మదర్ డెయిరీ ఆస్తుల అమ్మకంతో సమస్య పరిష్కారం కాదని అన్నారు. డెయిరీ అప్పులపై రాష్ట్ర ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకోవాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.

శివరాత్రి వేడుకలకు సిద్ధం చేయండి

మంత్రి కొండా సురేఖ అధికారులకు కీలక ఆదేశాలు

మహా, హైదరాబాద్: మహా శివరాత్రి పర్వదినం సమీపిస్తున్న వేళ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శివాలయాల్లో మహా శివరాత్రి సందర్భంగా ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఈఓలతో మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే వేములవాడ, కాళేశ్వరం, భద్రకాళి , తదితర దేవస్థానాల్లో అవసరమైన ఏర్పాట్లపై మంత్రి సురేఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతేడాది శివరాత్రి ఏర్పాట్ల అనుభవాల ఆధారంగా ఈసారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ప్రధానంగా క్యూలైన్ మేనేజ్మెంట్, తాగునీరు వసతి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, అరుబయట ప్రదేశాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారుల నుంచి మంత్రి సురేఖ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పండుగ నేపథ్యంలో శైవ క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు

మహా, హైదరాబాద్: రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు అయినట్లు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. పార్లమెంటులో ముఖ్యమైన బిల్లులపై చర్చ ఉన్నందున రాహుల్ పర్యటన రద్దయిందని అన్నారు. ఈ నేపథ్యంలో సమయం లేకపోవడంతో తెలంగాణకు రాలేకపోతున్నారని వివరించారు. కాగా, షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు రాహుల్ శంషాబాద్ చేరుకుని అక్కడ నుంచి చార్టర్లో వరంగల్ చేరుకోవాల్సి ఉంది. వరంగల్ పట్టణంలో కాసేపు విశ్రాంతి తీసుకుని అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం, 7:30కి వరంగల్ నుంచి రైలులో చెన్నై వెళ్లాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల రాహుల్ పర్యటన రద్దు అయ్యింది.

గ్రామాల స్వయం సమృద్ధికి యాక్షన్ ప్లాన్

తెలంగాణలోనూ కేరళ మోడల్

పంచాయతీల బలోపేతంపై ప్రత్యేక దృష్టి
మంత్రి సీతక్కతో క్రిస్ప్ సంస్థ భేటీ
పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో నివేదన

మహా, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోనూ గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా మార్చే ప్రణాళికలు, స్థానిక ప్రభుత్వాల్లో సంస్కరణలు తెచ్చే దిశలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రి సీతక్కతో (సీఆర్ఐఎస్పీ) క్రిస్ప్ సంస్థ మెంబర్ సెక్రటరీ, భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ ఆర్. సుబ్రహ్మణ్యం భేటీ అయ్యారు. తమ సంస్థ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి సీతక్కకు సుబ్రహ్మణ్యం నివేదించారు. ఆయా రాష్ట్రాల్లో ఆయా రంగాల్లో తీసుకొచ్చిన సంస్కరణలు, ఫలితంగా సాధించిన పురోగతిని మంత్రికి వివరించారు. కేరళ మాజీ చీఫ్ సెక్రటరీ విజయానంద్ అధ్యక్షతన, 10 మంది సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారుల ఆధ్వర్యంలో క్రిస్ప్ సంస్థ పని చేస్తున్నట్లు తెలిపారు. కేరళ గ్రామ పంచాయతీల బలోపేతం కోసం విజయానంద్ కృషి చేసినట్లు వెల్లడించారు.

ప్రత్యేక సంస్కరణలు

విజయానంద్ అనుభవాలతో తెలంగాణలో గ్రామపంచాయతీల బలోపేతం, గ్రామాల అభివృద్ధి కోసం సంస్కరణలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. గ్రామ పంచాయతీల కార్యకలాపాల్లో మహిళ స్వయం సహాయక బృందాల సహకారం తీసుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. మహిళా సంఘాలు, గ్రామపంచాయతీల మధ్య సమన్వయం సాధిస్తే గ్రామాల్లో అద్భుతాలు సృష్టించవచ్చు.. కేరళ మోడల్లో ఈ విధానం సక్సెస్ అయిందన్న అభిప్రాయంలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఆ దిశలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఇవ్వాలని సంస్థ సెక్రటరీ సుబ్రహ్మణ్యం కి మంత్రి సీతక్క సూచించారు. యాక్షన్ ప్లాన్ క్యాబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

స్వయం సమృద్ధి దిశగా..

గ్రామ సభల నిర్వహణ, గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా మార్చే ప్రణాళికలు, స్థానిక ప్రభుత్వాల్లో సంస్కరణలు తెచ్చే దిశలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మంత్రి సీతక్క కోరారు. స్థానిక ఎన్నికలు పూర్తయి కొత్త పాలకమండళ్లు ఏర్పడే నాటికి యాక్షన్ ప్లాన్ ఖరారు చేయాలని సూచన ఇచ్చింది. ఈ క్రమంలోనే ప్రభుత్వంతో క్రిస్ప్ సీఆర్ఐఎస్పీ (క్రిస్ప్) సీతక్క సమక్షంలో క్రిస్ప్ మెంబర్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, సీఆర్డీ డైరెక్టర్ సృజన ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. 14 రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి క్రిస్ప్ సంస్థ పనిచేస్తున్నదని, ఆయా రాష్ట్రాలకు ఉచితంగా సంస్థ సేవలందిస్తున్నదని రిటైర్డ్ ఐఏఎస్ తెలిపారు.

15న తెలంగాణ క్యాబినెట్ భేటీ

- పలు అంశాలపై చర్చకు వచ్చే అవకాశం

మహా, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 15న భేటీకానుంది. సచివాలయంలో జరిగే క్యాబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. డెడికేటెడ్ కమిషన్ నివేదికపై చర్చించి ఆమోదించే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు కోసం రిటైర్డ్ ఐఏఎస్ భూసాని వెంకటేశ్వరరావు చైర్మన్ గా డెడికేటెడ్ కమిషన్ నివేదిక రూపొందించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చర్చకు రానుంది. ఇప్పటికే కుల సర్వేను అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన విషయం విదితమే. బీసీ కులగణన, రిజర్వేషన్లపై ఇప్పట్లో తేలే అవకాశం లేనందున రాజకీయ పార్టీగా 42శాతం అమలు చేస్తామని అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి ప్రకటించారు.

చికెన్ ప్రియులూ జర జాగ్రత్త!

- బర్డ్ ఫ్లూ విస్తరిస్తున్న నేపథ్యంలో సర్కార్ వార్నింగ్..
- కోళ్ల పెంపకందారులకు, చికెన్ వ్యాపారులకు కీలక సూచనలు

మహా, హైదరాబాద్: కోళ్లకు సోకుతున్న బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సర్కార్ హెచ్చరించింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లోని ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లో భారీ సంఖ్యలో కోళ్ల మరణాలకు ఏవిఎన్ ఇన్ ఫ్లూయెంజా (హెచ్ 5ఎన్1 బర్డ్ ఫ్లూ) వైరస్ కారణమని నిర్ధారించారు. ఈ వ్యాధి కోళ్లలో వేగంగా వ్యాపిస్తూ తెలంగాణకు కూడా విస్తరించనుందన్న సమాచారం నేపథ్యంలో కొన్ని రోజులు కోళ్ల పెంపకం.. మాంసం వినియోగం పట్ల జాగ్రత్తలు పాటించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన సూచనలను పరిగణలోకి తీసుకుని ముందస్తుగా జాగ్రత్తగా ఈ హెచ్చరికలు జారీ చేస్తున్నట్లుగా తెలంగాణ పశుసంవర్ధక, మత్స్యశాఖ విభాగం తెలిపింది.

కలెక్టర్లకు ఆదేశాలు..

కోళ్లు, ఇతర జంతువులలో సంభవించే అనుమానాస్పద, వైరస్ మరణాల పట్ల కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రభుత్వం సూచించింది. కోళ్ల పెంపకందారులు, పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమై బర్డ్ ఫ్లూ వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొంది. కోళ్ల ఫారాల్లో కోళ్లు చనిపోతే వెంటనే సంబంధిత వెటర్నీ దవాఖానలో సమాచారం ఇవ్వాలని యాజమానులకు సూచించారు. ఇప్పటికే బర్డ్ ఫ్లూ వ్యాధిపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో జిల్లాలోని కోళ్ల ఫారాల యాజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కుంభమేళాకు వెళ్లివస్తుండగా ఘోర ప్రమాదం

మహా, భూపాల్: మధ్యప్రదేశ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు నగరవాసులు దుర్మరణం చెందారు. మినీ బస్సును భారీ సిమెంట్ ట్రక్కు ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

ఎనిమిది మంది నగరవాసులు మృతి..
మధ్యప్రదేశ్ జబల్‌పూర్‌లో ఘటన
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి
సహాయక చర్యలపై ఆరా

హైదరాబాద్ నుంచి కుంభమేళాకు వెళ్లి తిరిగివస్తుండగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మృతులు నాచారంలోని కార్తికేయ నగర్, రాఘవేంద్రనగర్ వాసులుగా తెలుస్తోంది. మృతులు నవీన్, బాలకృష్ణ, సంతోష్, శశికాంత్, రవి, ఆనంద్, మల్లారెడ్డిలుగా గుర్తించారు. వీళ్లంతా బంధువులేనని సమాచారం. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మొత్తం మూడు బస్సుల్లో కుంభమేళాకు యాత్రికులు వెళ్లారు. ప్రమాద సమయంలో మినీ బస్సులో మొత్తం 14మంది ప్రయాణికులు ఉన్నారు.

సీఎం రేవంత్ విచారం..

మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యాత్రికులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం, అధికారులతో మాట్లాడి క్షతగాత్రులకు అన్ని రకాలుగా సాయం అందేలా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం తెలుగు ప్రయాణికుల పరిస్థితి, వారికి అందుతున్న సాయంపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని అధికారులను ఆదేశించారు.